నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, శుక్రవారం14 జూన్ 2024 | VIKARABAD

### భారంగా వ్యవసాయం..



కేసీఆర్ ప్రభుత్వం రైతులకు అన్నింటా భరోసా కల్పించడంతో వ్యవసాయం పండుగలా సాగింది. సకాలంలో రైతుబంధు అందు కొని.. అప్పుల బాధలు లేకుండా వ్యవసాయం చేసుకునేవాళ్లం. ఇప్పుడు వ్యవసాయం అంటే భారంగా మారింది. పెట్టుబడి సాయం అందక రైతులందరం నానా ఇబ్బందులు పడుతున్నాం. పంట పండించుకోవడం ఒక ఎత్తైతే.. కాంగ్రెస్ సర్కార్ తీరుతో చేతికందిన పంటలను అమ్ముకోవడం కూడా గగనంగా మారింది.

**-ముక్తార్, ఆలేడ్, కొడంగల్**

### వ్యవసాయానికి గడ్డుకాలం..



రైతు భరోసా లేకపోవడం వల్ల వ్యవసాయానికి గడ్డు కాలం వచ్చింది. గత ప్రభుత్వం రైతుకు పూర్తి భరోసా కల్పించడంతో రైతులం ఆనందంగా వ్యవసాయం చేసుకున్నాం ప్రస్తుతం కాంగ్రెస్ హయాంలో పెట్టుబడి, రుణాలు అందక పంట సాగు కోసం అప్పులు చేసుకోవాల్సిన దుస్థితి వచ్చింది. ఎన్నో కష్టాలు పడుతూ వ్యవసాయం చేసుకుంటున్నాం. మళ్లీ అప్పులు చేసి పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి వస్తదని అనుకోలేదు. ఈ ఘనత కాంగ్రెస్‌దే.

**- లక్ష్మారెడ్డి, ఐనాన్‌పల్లి, కొడంగల్**

# రైతు భరోసా ఏది?



- అన్నదాతలకు ఇంకా అందని పెట్టుబడి సాయం
- రుణాలూ ఇవ్వలే.. విత్తనాలు, ఎరువులు అంతంతే..
- లాగోడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు
- ఎకరాకు రూ.15 వేల సాయంపై కొరవడిన స్పష్టత
- కాంగ్రెస్ సర్కార్ తీరుపై అన్నదాతల ఆగ్రహం

వికారాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు మాసాల్లోనే రైతులు అవస్థలు పడుతున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో అప్పుల కోసం చూడని రైతులు.. పంట పెట్టుబడి కోసం మళ్లీ అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో సీజన్ ప్రారంభానికి ముందే విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేసేందుకు రైతుబంధు సాయాన్ని అందజేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అదును దాటుతున్నా సాయం అందకపోవడంతో రైతులు పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఈ తరుణంలో అప్పులు దొరకక రైతులు తీవ్ర కష్టాలు పడుతున్నారు. అంతేకాకుండా ఇంకా రుణ ప్రణాళిక ఖరారు కాకపోవడంతో బ్యాంకర్లు రైతులకు రుణాల మంజూరు ప్రక్రియను కూడా చేపట్టలేని పరిస్థితి ఉన్నది. రుణ ప్రణాళికకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాకపోవడమో.. జిల్లా లీడ్ బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యమో తెలియదు కానీ బ్యాంకర్లు ఇంకా రుణాల మంజూరు ప్రక్రియ షురూ చేయలేదు. దీంతో రైతులు అధిక వడ్డీతో లాగోడికి అప్పులు చేస్తున్న పరిస్థితి కనిపిస్తున్నది. గత పదేండ్లలో ఏ ఇబ్బందులు లేకుండా పంట దిగుబడిపైనే దృష్టి సారించి సాగు చేసిన జిల్లా రైతాంగానికి కాంగ్రెస్ హయాంలో పెట్టుబడికి డబ్బులు లేని పరిస్థితి వచ్చింది. మరోవైపు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన అనంతరం రైతును రాజు చేసే ఆలోచనతో రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చేలా కేసీఆర్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలో పెట్టుబడి సమయానికి అందడంతో గత పదేండ్లలో పంట రుణాలు తీసుకునే రైతుల సంఖ్య సగానికిపైగా తగ్గిపోవడం గమనార్హం. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా అమలు చేస్తామంటూ హామీనిచ్చి విస్మరించింది. యాసంగిలోనూ పూర్తి స్థాయిలో రైతుబంధు అందజేయకపోవడవంతో అన్నదాతలు తీవ్ర కష్టాలు పడ్డారు.

#### ఖరారు కాని రుణ ప్రణాళిక...

ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రుణ ప్రణాళిక ఇంకా ఖరారు కాలేదు. దీంతో బ్యాంకర్లు రైతులకు రుణాలను మంజూరు చేసే ప్రక్రియ ప్రారంభించలేదు. ఓ వైపు పెట్టుబడి సాయం అందకపోవడం, మరోవైపు రుణాలు మంజూరు కాకపోవడంతో జిల్లా రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నది. అధిక వడ్డీతో అప్పులు తీసుకునేందుకు భయపడుతున్న కొంతమంది రైతులు బ్యాంకర్లు రుణాలు ఎప్పుడు మంజూరు చేస్తారోనని ఎదురుచూస్తున్నారు. మరోవైపు రైతులకు పంట రుణాలను మంజూరు చేయడంలో బ్యాంకర్లు ఏటా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గత యాసంగి సీజన్‌లో నిర్దేశించిన లక్ష్యంలో 35 శాతం మేర రుణాలను మంజూరు చేశారు. గతేడాది వానకాలం, యాసంగి సీజన్లకుగాను రూ.3082 కోట్ల రుణాలివ్వాలని లక్ష్యంగా నిర్దేశించగా రూ.1786 కోట్ల రుణాలను బ్యాంకర్లు రైతులకు రుణాలను మంజూరు చేశారు. వానకాలం సీజన్‌లో రూ.1550 కోట్ల రుణాలను మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, రూ.1225 కోట్ల రుణాలు, యాసంగి సీజన్‌కుగాను సంబంధించి రూ.1532 కోట్ల రుణాలను మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా కేవలం రూ.532 కోట్ల రుణాలను మాత్రమే మంజూరు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన అనంతరం ప్రభుత్వం బ్యాంకర్లను పట్టించుకోకపోవడంతో పంట రుణాలివ్వడంలో వారు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెట్టుబడి సాయం అందించాలని రైతులు కోరుతున్నారు.

#### ఇంకెప్పుడిస్తారో...

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా అమలు చేసే దిశగా ఆలోచించడం లేదు. రైతుభరోసా పథకంలో భాగంగా ఎకరాకు రూ.15 వేల పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పినప్పటికీ ఇప్పటివరకు ప్రారంభించకపోవడం గమనార్హం. దీనికి సంబంధించి ఇంకా విధివిధానాలను కూడా ఖరారు చేయకపోవడంతో పెట్టుబడి సాయం ఇంకెప్పుడు వస్తుందోనంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే యాసంగిలో రైతు భరోసాను అమల్లోకి తీసుకువస్తారని రైతులు ఆశించినప్పటికీ కేసీఆర్ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన రైతుబంధు కిందనే ఎకరాకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. వానకాలం సీజన్ ప్రారంభం కావడంతోపాటు అధిక వడ్డీతో అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు తెచ్చుకున్న రైతులు కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారు. నమ్మి గెలిపించినందుకు రైతులను మోసం చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.2926 కోట్ల రైతుబంధు సాయాన్ని అందజేసింది.

**కేసీఆర్ సర్కార్ అందించిన సాయం ఇలా..**

2018 వానకాలం సీజన్‌లో 1,94,833 మంది రైతులకుగాను రూ.221 కోట్లు, యాసంగిలో 1,75,989 మంది రైతులకు రూ.206 కోట్లు, 2019 వానకాలం సీజన్‌లో 1,78,998 మంది రైతులకు రూ.255 కోట్లు, యాసంగి సీజన్‌లో 1,71,824 మందికి రూ.194 కోట్ల పెట్టుబడి సాయం అందజేసింది. అలాగే 2020 వానకాలంలో 2,113,341 మంది రైతులకు రూ.297 కోట్లు, యాసంగిలో 2,19,264 మందికి రూ.301 కోట్లు, 2021 వానకాలంలో 2,25,438 మంది రైతులకు రూ.300 కోట్లు, యాసంగిలో 2,24,928 మందికి రూ.241 కోట్లు అందించింది. అదేవిధంగా 2022–23 ఆర్థిక సంవత్సరంలో వానకాలం సీజన్‌లో 2,47,707 మంది రైతులకు రూ.305 కోట్లు, యాసంగిలో 2,43,447 మందికి రూ.299 కోట్ల సాయం చేసింది. 2023–24లో వానకాలం 2,62,065 మంది రైతులకు రూ.307.47 కోట్ల రైతుబంధు సాయాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది.

# ఆయిల్ పామ్‌పై.. అనాసక్తి



**రంగారెడ్డి** జిల్లాలో ఆయిల్ పామ్ సాగు పట్ల రైతాంగం అంతగా ఆసక్తి చూపడం లేదు. ఈ పంట సాగుపై కాంగ్రెస్ ప్రభుత్వం అంతగా ప్రచారం చేయకపోవడం.. నీటి కొరత, కరెంటు కోతల వంటి పరిస్థితుల వల్లనే రైతులు ముందుకు రావడం లేదని తెలుస్తున్నది. గతేడాది జిల్లాలో 979 ఎకరాల్లో సాగు చేయాలని సంకల్పించినప్పటికీ.. రైతులు 750 ఎకరాల్లోనే ఆయిల్ పామ్ సాగును చేపట్టారు. ఈ ఏడాది 6-7వేల ఎకరాల్లో సాగు చేసేలా ఉద్యానవన శాఖ ప్రణాళిక రూపొందించింది. కానీ.. ప్రస్తుత పరిస్థితుల్లో లక్ష్యం పూర్తికావడమన్నది సందేహాస్పదమే అవుతున్నది. ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు సంబంధిత శాఖ అధికారులు విస్తృతంగా సమావేశాలు నిర్వహించే పనిలో నిమగ్నమయ్యారు.

-రంగారెడ్డి, జూన్ 13 (నమస్తే తెలంగాణ)

- జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు రైతుల నుంచి స్పందన కరువు
- గత ఏడాది పూర్తి కాని లక్ష్యం.. ఈ ఏడాది మరో 6-7వేల ఎకరాల్లో సాగు చేసేలా ఉద్యానవన శాఖ ప్రణాళిక
- ముందుగానే పదేళ్లు అగ్రిమెంట్ రాయించుకుంటున్న అధికారులు
- ఆసక్తి తగ్గడానికి నీటి కొరత..కరెంటు కోతలే కారణం!
- సమావేశాలతో రైతులను చైతన్యపరుస్తున్న అధికారులు

రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఇతోధికంగా సబ్సిడీ ఇస్తున్నది. ఒక్క ఎకరంలో ఆయిల్‌పామ్ సాగుకోసం ప్రభుత్వం రైతుకు రూ.50,600 సబ్సిడీ ఇస్తున్నది. ఎకరంలో 57 మొక్కలు నాటాల్సి ఉండగా.. ఒక్కొక్క మొక్కకు రూ.200 ధర ఉంటుంది. ఈ లెక్కన రెండు వందల మొక్కలకు రూ.11,600 కానుండగా.. ప్రభుత్వం 80 శాతం సబ్సిడీ అంటే రూ.10,260 చెల్లిస్తున్నది. మిగతా రూ.1,140 రైతు చెల్లిస్తే సరిపోతుంది. అలాగే డ్రిప్పు కోసం ఎకరాకు రూ.30వేలు ఖర్చు అవుతుండగా.. రైతు వాటా కింద రూ.7వేలు చెల్లిస్తే మిగతా రూ.23వేల వరకు ప్రభుత్వం ఇస్తున్నది. డ్రిప్ సిస్టమ్ కోసం బీసీలకు 90 శాతం సబ్సిడీ, ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం సబ్సిడీ ఇస్తున్నది. పన్నెండున్నర ఎకరాల వరకు రైతులు ప్రభుత్వం నుంచి రాయితీలు పొందే అవకాశం ఉన్నది. అలాగే మొక్కలు నాటాక నాలుగు ఏండ్లవరకు కాత రాదు. నాలుగేండ్ల వరకు మొక్కల సంరక్షణతోపాటు ఆయిల్ పామ్ అంతర పంటల సాగుకోసం ప్రభుత్వం రూ.4,200 చొప్పున నాలుగు సంవత్సరాలకు రూ.16,800 ఇస్తున్నది. రైతులు కేవలం గుంతలు తీసుకుని మొక్కలు, డ్రిప్పు కోసం రూ.8,140 చెల్లిస్తే సరిపోతుంది. ప్రభుత్వం ఎకరాకు 50,600 సబ్సిడీ అందిస్తున్నది. ఆయిల్ పామ్ సాగుతో నాలుగేండ్ల తర్వాత నుంచి ముప్పై ఏండ్ల వరకు నిరంతర ఆదాయం పొందవచ్చు. పదేండ్ల తర్వాత ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఆయిల్ పామ్ సాగుకు గత కేసీఆర్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నివ్వగా.. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. మరోపక్క నీరు, కరెంటు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రైతులు ఈ పంట సాగుకు ముందుకు రావడం లేదని తెలుస్తున్నది. అయితే అయితే భూముల ధరలకు ఈ ప్రాంతంలో ఉన్న డిమాండ్ దృష్ట్యా దీర్ఘకాలిక పంట అయిన ఆయిల్ పామ్‌వైపు రైతులు మొగ్గ చూపడం లేదని అధికారులు మరో కారణంగా చెబుతున్నారు.

#### రైతులతో పదేండ్ల అగ్రిమెంటు..

ఇప్పటికే కొంతమంది రైతులు ఆయిల్ పామ్ తోటలను తొలగించాలనే ఆలోచనలో ఉన్నట్లు ముందే పసిగట్టిన ప్రభుత్వం ఆయా రైతులతో పదేండ్లు అగ్రిమెంట్‌ను ముందుగానే రాయించుకుంటున్నది. ప్రభుత్వం పెద్ద ఎత్తున రాయితీలు ఇస్తుండగా.. మధ్యలో రైతులు తోటలను తొలగిస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్న కారణంతో పదేండ్ల వరకు పంటలను తొలగించబోమని రైతులతో అగ్రిమెంట్ రాయించుకుంటున్నారు. మరోపక్క సదస్సులు, సమావేశాలు నిర్వహించి రైతులను చైతన్యపర్చేందుకు ఉద్యానవన శాఖ అధికారులు ఆపసోపాలు పడుతున్నారు. ఇప్పటికే లాభదాయకంగా సాగు చేస్తున్న ఆదర్శ రైతులను పరిచయం చేసేందుకు ఖమ్మం, సిద్దిపేట తదితర ప్రాంతాలకు జిల్లా రైతులను తీసుకెళ్తున్నారు.



#### ఆయిల్ పామ్‌ను సాగు చేయాలి..

జిల్లా రైతులు ఆయిల్ పామ్ వైపు దృష్టి సారించాలి. ఈ పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం భారీగా ప్రోత్సాహకాలు అందిస్తున్నది. మొక్కలు నాటడం, సస్యరక్షణ చర్యలు, పంటల విక్రయాల వరకు ఉద్యాన శాఖ అండగా ఉంటుంది. ఇప్పటికే ఆయిల్ పామ్ తోటలను సాగు అవుతున్న ప్రాంతాలకు రైతులను తీసుకెళ్లి చూపిస్తున్నాం. రైతు వేదికల్లో సమావేశాలు నిర్వహించి చైతన్యపరుస్తున్నాం.

**-నీరజా గాంధీ, ఇన్‌చార్జి జిల్లా ఉద్యావన శాఖ అధికారిణి, రంగారెడ్డి జిల్లా**





# చెరువుల పరిరక్షణకు పకడ్బందీగా ఏర్పాట్లు

**చెరువుల చుట్టూ ఫెన్సింగ్‌కు చర్యలు**

**రంగారెడ్డి కలెక్టర్ శశాంక**

రంగారెడ్డి, జూన్ 13(నమస్తే తెలంగాణ): చెరువుల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. గురువారం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహాశబరీశ్, అదనపు డీసీపీలతో కలిసి ఆయన చెరువులు, నాలాల పరిరక్షణపై మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ చెరువుల పరిరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలు, బఫర్ జోన్‌లోని అక్రమ నిర్మాణాలను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్న ఆక్రమణలను తొలగించడమే కాకుండా వారిపై పోలీసు చర్యలు తీసుకునేలా అధికారులు వ్యవహరించాలన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న ఆక్రమణలను తొలగించి కంచె ఏర్పాటు చేయాలన్నారు. చెరువుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతోపాటు చెరువుల హద్దులు, సంరక్షణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. శేరిలింగంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 64 చెరువులను పరిరక్షించి, పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇరిగేషన్ , హెచ్‌ఎండీఏ, రెవెన్యూ శాఖలతో కలిసి నోటిఫై చేసిన చెరువు వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత పత్రాలను పొందుపర్చాలన్నారు. ప్రజాక్షేత్రంలో ఎఫ్‌టీఎల్ హద్దు మ్యాప్‌ల అంతిమ నోటిఫికేషన్‌ను జారీ చేయడానికి అధికారులను నోడల్ ఏజెన్సీగా నియమించుకొని చర్యలు చేపట్టాలన్నారు. చెరువుల సంరక్షణకై ప్రాథమిక నోటిఫికేషన్‌ను జారీ చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఎఫ్‌టీఎల్ నిర్ధారణ, చెరువు భౌగోళిక స్వరూపం, సర్వే నంబర్లు, విస్తీర్ణం, ప్రాంతం, రెవెన్యూ మండలం వివరాలపై సమగ్ర స్థాయిలో సర్వే చేయాలన్నారు. కబ్జాలకు ఆస్కారం లేకుండా చెరువుల చుట్టూ ఫెన్సింగ్ , పకడ్బందీ వివరాలతో చెరువు మ్యాపులను, సంబంధిత వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. జోనల్ కమిషనర్ స్నేహాశబరీశ్ మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి పరిధిలో ఉన్న చెరువులకు ఇన్‌చార్జి అధికారులను నియమించినట్లు తెలిపారు. చెరువుల వద్ద సీసీ కెమెరాలతో గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్, పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ఎదుట ఆశ వర్కర్ల ధర్నా

- *ఆశ వర్కర్లకు నష్టం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్*
- *వెంటనే పారితోషికాన్ని రూ.18వేలకు పెంచాలి.. రూ.50లక్షల ఇన్సూరెన్స్ హామీని నెరవేర్చాలని పెద్ద ఎత్తున నినాదాలు*

రంగారెడ్డి, జూన్ 13(నమస్తే తెలంగాణ): ఆశ వర్కర్లకు నష్టం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ గురువారం రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ సంబంధిత అనేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్న ఆశల జ్ఞాపకశక్తిని పరీక్షించేందుకు ప్రభుత్వం ఎగ్జామ్స్ నిర్వహించాలనడం సమంజసం కాదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశ వర్కర్లకు ఇస్తున్న పారితోషికాన్ని రూ.18 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. పారితోషికాన్ని ప్రతి నెలా 2వ తేదీనే చెల్లించాలని, గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఇన్సూరెన్స్ రూ.50లక్షలు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ధర్నాలో యూనియన్ నేతలు చంద్రమోహన్, సాయిబాబు, సునీత, కవిత, కృష్ణ, ఎల్లేశ్, శేఖర్, ప్రవీణ్, యాదయ్య, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.





కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు





ప్రైవేట్ పాఠశాలల బస్సులను తనిఖీ చేస్తున్న ఇబ్రహీంపట్నం ఆర్టీఏ సిబ్బంది

# 14 బస్సులు సీజ్

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

ఇబ్రహీంపట్నం రూరల్/తుర్కయాంజాల్, జూన్ 13 : 'బడి బస్సు భద్రమేనా' అనే శీర్షికతో గురువారం నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఆర్టీఏ అధికారులు స్పందించారు. ఇబ్రహీంపట్నం ప్రాంతంలో అనుమతులు లేకుండా, ఫిట్‌నెస్ లేని ప్రైవేట్ పాఠశాలల బస్సులను గురువారం ఉదయం ఇబ్రహీంపట్నం ఆర్టీఏ సుభాష్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు నిర్వహించి 14 ప్రైవేట్ పాఠశాలల బస్సులను సీజ్ చేశారు. ఫిట్‌నెస్ లేకుండా విద్యార్థులను తరలిస్తున్న బస్సుల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇబ్రహీంపట్నం, తుర్కయాంజాల్, పెద్దఅంబర్‌పేట, ఆదిబట్ల మున్సిపాటీతోపాటుపలు ప్రాంతాల్లో బస్సులను తనిఖీ చేసి సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ సిబ్బంది పాల్గొన్నారు.


